నారాయణరావుపల్లిలో తాగునీటికి ఇబ్బందులు

సుల్తానాబాద్ రూరల్, మే21: రెండు రోజులుగా రక్షిత మంచినీటి సరఫరా లేకపోవడంతో మండలంలోని నారాయణరావుపల్లి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల నుంచి మిషన్ భగీరథ నీరు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ నల్లా నీళ్లు కూడా సక్రమంగా రావడం లేదని వాపోతున్నారు. జీపీ నీటి సరఫరాలో తరచూ ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆరోపిస్తున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో తాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేసేలా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో దివ్యాదర్శన్‌రావును వివరణ కోరగా తాగునీటి సమస్య తన దృష్టికి రాలేదన్నారు. తెలుసుకొని సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

మెరుగైన సేవల కోసమే క్యూఆర్ కోడ్

ప్రశంసాపత్రం అందుకుంటున్న అంతర్గాం ఎస్ఐ

● రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా

ఫర్టిలైజర్‌సిటీ/ అంతర్గాం, మే 21: ప్రజలకు, బాధితులకు మెరుగైన సేవలు అందించేందుకు తెలంగాణ పోలీసు శాఖ క్యూఆర్ కోడ్‌ను రూపొందించిందని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా క్యూఆర్‌కోడ్, సిటిజన్ ఫీడ్ ఆధారంగా టాప్ 10 పోలీస్‌స్టేషన్లలో అంతర్గాం పోలీస్ స్టేషన్‌కు మూడోస్థానం లభించడంపై హర్షం వ్యక్తం చేశారు. పోలీస్ సిబ్బంది గురించి ప్రజలేమనుకుంటున్నారని, ప్రజలకు సరైన ఆధారణ సేవలు లభిస్తున్నాయని, ఫిర్యాదుదారులతో సిబ్బంది ప్రవర్తన అనే విషయాలు తెలుసుకోవడం కోసం క్యూఆర్‌కోడ్‌గా తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లల్లో, ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద వెబ్‌సైట్‌లో ఈ క్యూఆర్‌కోడ్ అందుబాటులో ఉంటుందని ప్రజలు స్కాన్ చేస్తే పోలీసుల పనితీరు గురించి ప్రశ్నలు ఉంటాయని, వాటికి సమాధానాలు టైప్‌చేయడం లేదా వాయిస్ ద్వారా సమాధానం పంపవచ్చని సీపీ వివరించారు. హైదరాబాద్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర డీజీపీ జితేందర్ అంతర్గాం ఎస్ఐకి ప్రశంసా పత్రం అందజేశారు. అంకితభావంతో అందించిన సేవలకు గానూ ఈ గుర్తింపు లభించడం పట్ల పలువురు ఉన్నతాధికారులు అభినందించారు.

బొగ్గు గని కార్మికుల పెన్షన్ పెంపునకు కృషి చేయండి

గోదావరిఖని, మే 21: బొగ్గు గని పెన్షన్ కార్మికులకు పెన్షన్ పెంపుదల కోసం కృషి చేయాలని ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కోరినట్లు కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ కన్వీనర్లు దండంరాజు రామచందర్‌రావు, ఆళవందార్ వేణుమాధవ్ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీలోని శాస్త్రి భవన్‌లో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బీకే శ్రీవాస్తవ్, పీకే సింగ్ రాథోడ్‌లు బొగ్గు రంగంలో పెన్షనర్ల దుస్థితి, వేగవంతమైన సంస్కరణల ఆవశ్యకత గురించి మంత్రికి వివరించినట్లు పేర్కొన్నారు.

పరిశుభ్రత పాటించాలి

పెద్దపల్లి, మే21: టిఫిన్ సెంటర్ నిర్వాహకులు ఖచ్చితంగా పరిశుభ్రను పాటించాలని మున్సి పల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్ సూచించారు. పట్టణంలోని కమాన్ రస్తాలో పలు టిఫిన్ సెంటర్లను మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేయగా, పరిశుభ్రత పాటించని టిఫిన్ సెంటర్ నిర్వాహ కుడికి రూ. 5వేలు జరిమానా వేసినట్లు వెల్లడిం చారు. శుభ్రత పాటించక పోయిన, నిల్వ ఉంచిన, నాణ్యత లేని ఆహార పదార్థాలు విక్రయించిన జరిమాన విధిస్తామని హెచ్చరించారు. తనిఖీలో వార్డ్ ఆఫీసర్లు ప్రదీప్ ,శ్రీనివాస్, కుమార్, సుధీర్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రామ్మోహన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336372-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం

200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి

50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571

9182 777 189

వడ్ల తూకంలో జాప్యంపై రైతుల ఆగ్రహం

జూలపల్లిలోని కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులతో గొడవ పడుతున్న రైతులు

జూలపల్లి, మే 21 : వడ్లు తూకం వేయించడంలో నిర్వాహకులు పక్షపాతం చూపిస్తున్నారంటూ రైతులు కన్నెర చేశారు. జూలపల్లి మండల కేంద్రంలోని ఏఎంసీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహణ తీరుపై రైతులు బుధవారం మండిపడ్డారు. ఓ వైపు హమాలీల కొరత, మరో వైపు నిర్వాహకులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కొంత మంది రైతుల వద్ద డబ్బులు తీసుకుంటూ వడ్లు తూకం వేస్తున్నారని ధ్వజమెత్తారు. తేమ శాతం లేదని వడ్లు తిరస్కరిస్తూ మెలిక పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ దశలో జూలపల్లికి చెందిన రైతు కల్లెం ప్రతాప్‌రెడ్డి పెట్రోల్ బాటిల్ వెంట తీసుకు వచ్చి తన వడ్ల కుప్పను తగుల బెట్టుకుంటానంటూ బెదిరించాడు. 15 రోజులు గడుస్తున్నా వడ్లు తూకం వేయడం లేదని వాపోయాడు. వరుస క్రమంగా వడ్లు తూకం వేయని నిర్వాహకులపై చర్యల తీసుకోవాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాలు, ఉరుములు, మెరుపులు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నా ధాన్యం వెంట వెంటనే తూకం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు కేంద్రాన్ని సందర్శించాలని రైతులు విజ్ఞప్తి చేశారు.

ర్యాలీలో జాతీయ జెండాలతో హిందూ ఐక్యవేదిక నాయకులు

సైనికులకు మద్దతుగా తిరంగా ర్యాలీ

జ్యోతినగర్, మే 21: ఇటీవల ఆపరేషన్ సిందూర్ విజయవంతంతో భారతదేశ సైనికులకు సంఘీభావంగా మంగళవారం రాత్రి ఎన్టీపీసీ పట్టణంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ జరిగింది. జాతీయ పతకాలతో పట్టణ ప్రధాన వీధుల మీదుగా విజయోత్సవ యాత్రను చేపట్టారు. ఇక్కడ ఎస్సీ రిజర్వేషన్ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు భూషి పాక మహారాజ్‌తో పాటు ఆర్యవైశ్య సంఘం, హిందూ సంస్థలు, వివిధ రాజకీయ నాయకులు, వ్యాపారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

వంతెన పనులకు ఎమ్మెల్యే భూమి పూజ

జూలపల్లి, మే 21 : జూలపల్లి-పెద్దాపూర్ గ్రామాల మధ్య హుస్సేనిమి యా వాగుపై కొత్త వంతెన నిర్మాణ పనులకు బుధవారం సాయంత్రం పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణా రావు భూమి పూజ నిర్వహించారు. పెద్దాపూర్ నుంచి తేలుకుంట, చీమల పేట ద్వారా ఎలిగేడు దాకా డబుల్ రోడ్డు నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. లోకపేట ఎక్స్ రోడ్డు నుంచి వెంకట్రావ్‌పల్లి, కాచా పూర్, వడ్కాపూర్ మీదుగా జూలపల్లి దాకా నిర్మిస్తున్న డబుల్ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ధూళికట్ట సింగిల్ విండో చైర్మన్ పుల్లూరి వేణుగోపాల్‌రావు, ఏఎంసీ చైర్మన్ గండు సంజీవ్, వైస్ చైర్మన్ కొమ్మ పోశాలు, నాయకులు గొట్టెముక్కుల రవీందర్‌రెడ్డి, లోక జలపతిరెడ్డి, బండి స్వామి, సిరికొండ కొమురయ్య, చుక్కయ్య, మల్లారపు సంపత్, ఈర్ల స్వామి పాల్గొన్నారు.

అన్ని హంగులతో కూరగాయల మార్కెట్ నిర్మాణం

పెద్దపల్లి టౌన్, మే 21: పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను అన్ని హంగులతో నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే విజయరమ ణారావు తెలిపారు. బుధవారం కూరగాయల మార్కెట్‌ను సందర్శించారు. హోల్‌సెల్, రిటైల్ వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. నూతన నిర్మాణ పనుల మ్యాప్ డ్రాఫ్టును పరిశీలించారు. అమ్మకునేందుకు వీలుగా సౌకర్యాలు ఉంటాయని, ఆ దిశగా టెండర్లు 20 రోజుల్లో జరుగుతాయని పేర్కొన్నారు. ఇక్కడ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేశ్, మాజీ కౌన్సిలర్లు సుభాశ్‌రావు, మల్లయ్య, సంపత్, నాయకులు మస్రత్, బొడ్డుపల్లి శ్రీనివాస్, దొడ్డుపల్లి జగదీశ్, హోల్‌సెల్ రిటైల్ వ్యాపాల సంఘం నాయకులు తోఫిక్, సర్వర్, మహబూబా, జానీ పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'ని వినియోగించుకోవాలి

మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, మే21: గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఉపాధి హామీ పథకాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలని కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులకు సూచించారు. ఈజీఎస్ పనులపై సంబంధిత అధికారులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఉపాధి హామీ పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో కూలీలకు ఉపాధి హామీలో పని కల్పించాలని, అవసరమైన వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కూలీల సంఖ్య పెంచేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. చిన్న నీటిపారుదల, లిఫ్ట్ ఇరిగేషన్, చెరువులు, ఎస్సారెస్పీ కాల్వల మరమ్మతు పనులను గుర్తించి పూర్తి చేయించాలని సూచించారు. యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజీవ్ యువ వికాసం పథకం కింద లబ్ధిదారులకు జూన్ 2 నాటికి స్వయం ఉపాధి యూనిట్ మంజూరు పత్రాల పంపిణీ చేసేలా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. జడ్పీ సీఈవో నరేందర్, డీఆర్డీవో ఎం కాళిందిని, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ల బదిలీ

జిల్లాలోని 8మంది తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మంచిర్యాల జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ కే రమేశ్‌ను పెద్దపల్లి ఆర్డీవో కార్యాలయ డీఏవోగా, కే వై ప్రసాద్‌ను కలెక్టరేట్ ఎఫ్, హెచ్ విభాగాల సూపరింటెండెంట్‌గా, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి వచ్చిన తహసీల్దార్ బీ దత్తు ప్రసాద్‌రావును రామగుండం తహసీల్దార్‌గా, నిజామాబాద్ జిల్లా నుంచి వచ్చిన ఏ ఆంజనేయులును మంథని ఆర్డీవో కార్యాలయ డీఏవోగా బదిలీ చేశారు. అలాగే ఓదెల తహసీల్దార్ జే సునీతను పాలకుర్తికి, ఈడీ-ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయ నాయబ్ తహసీల్దార్ కే ధీరజ్ కుమార్‌ను ఓదెల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా, కలెక్టరేట్ ఎఫ్, హెచ్ విభాగాల సూపరింటెండెంట్ బీ యాకన్నను ఎలిగేడుకు, ఇక్కడి తహసీల్దార్ ఎండీ బషీరొద్దీన్‌ను సుల్తానాబాద్‌కు బదిలీ చేశారు.

నకిలీ విత్తనాల నియంత్రణకు టాస్క్ ఫోర్స్ కమిటీ ఏర్పాటు

జిల్లాలో నకిలీ విత్తనాల నియంత్రణకు టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు డీఏవో దోమ ఆదిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కమిటీలో వ్యవసాయాధికారి, విత్తన ధ్రువీకరణ అధికారి, పోలీస్ అధికారి ఉంటారని తెలిపారు. వ్యవసాయ శాఖ నుంచి పెద్దపల్లి ఏడీఏ ఎం శ్రీనాథ్ (సెల్ 8977752820), విత్తన ధ్రువీకరణ సంస్థ (కరీంనగర్) నుంచి వై సునీల్ (సెల్7288879682,7799011929), పోలీస్ శాఖ (కమాన్‌పూర్) నుంచి జే రవళితో విత్తన తనిఖీ కోసం టాస్క్‌ఫోర్స్ కమిటీ ఏర్పాటు చేశామని వివరించారు. వీరు నిరంతరం అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. గ్రామాల్లో రాత్రి వేళలలో బీజీ III, హెచ్‌టీ పత్తి విత్తనాలను ఎవరైనా అమ్మితే టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

ఎన్టీపీసీ ప్లాంటులో ఇద్దరు కార్మికులకు గాయాలు

జ్యోతినగర్, మే 21: రామగుండం ఎన్టీపీసీ ప్లాంటులో బుధవారం ప్రమాదవశాత్తు ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులకు అయిల్ మీద పడటంతో తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్లితే ప్లాంటులోని స్టేజీ 2 అయిల్ ట్యాంకర్ ఏరియాలో పనిచేస్తున్న కొమురయ్య, అంకూస్‌లు అయిల్ క్రషర్ వాల్ తిప్పుతున్న క్రమంలో ప్రమాదశాత్తు ఒంటిపై పడింది. గాయపడిని ఇద్దరిని ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని ధన్వంతరి దవాఖానకు తరలించారు. కొముయ్యకు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.

కాట్నపల్లిలో ఎన్ఎస్ఎస్‌వో బృందం సర్వే

సుల్తానాబాద్‌రూరల్,మే21: మండలంలోని కాట్నపల్లి గ్రామంలో బుధవారం ఎన్ఎస్ఎస్‌వో కరీంనగర్ బృందం సభ్యులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా బృందం గ్రామంలో పర్యటించి ఆరోగ్యం, విద్య సామాజిక ఆర్థిక పరిస్థితులు తదితర అంశాలపై సర్వే నిర్వహించారు. డిప్యూటి డైరెక్టర్ జనరల్ బీజింద్రసింగ్, బృందం సభ్యులు శ్రీనివాస్ రావు, సుధాకర్, శ్రీనాథ్‌లతో పాటు తదితరులు ఉన్నారు.

ఆర్జీ -3 ప్రాతినిధ్య సంఘంతో నిర్మాణాత్మక సమావేశం

సమావేశంలో జీఎం నాగేశ్వర్‌రావుతో కార్మిక నాయకులు

రామగిరి, మే 21 :రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో ప్రాతినిధ్య సంఘం సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ ప్రతినిధులతో బుదవారం జీఎం కార్యాలయంలో ఏరియా స్థాయి నిర్మాణాత్మక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా ఏరియాకు సంబంధించిన పలు అంశాలపై రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావుతో ప్రాతినిధ్య సంఘం ఏరియా ఉపాధ్యక్షులు కోట రవీందర్ రెడ్డి, ఇతర సభ్యులు చర్చించారు. ఈ సమావేశంలో ఏరియాలోని క్యాంటీన్లలో, జీఎం కార్యాల యంలోని వివిధ విభాగాల ఆఫీస్‌లో ఏసీ లు అమర్చడం, సెంటినరీ కాలనీలో ముద్దగన్నేరు చెట్లు, ఎండిపోయిన చెట్ల కొమ్మలు తొలగించడం, స్విమ్మింగ్ పూల్ ప్రహరీ గోడ ఎత్తు పెంచి, సీ -2 క్వార్టర్స్ పక్కన గేట్ అమర్చడం, స్విమ్మింగ్ పూల్ కోసం కొత్త మోటర్ల కొనుగోలు , డ్రైనేజీ గార్డ్స్ ఏర్పాటు , రాణి రుద్రమ దేవి క్రీడా ప్రాంగణంలో వాకింగ్ ట్రాక్ పునరుద్ధించడం, సీహెచ్‌పీ లో టెండాల్ యాక్టింగ్ మస్టర్లు ఉన్న వారికి ఉద్యోగోన్నతి కల్పించడం, సీహెచ్‌పీ లో ఉద్యోగ విరమణ పొందుతున్న ఉద్యోగులకు సన్మానం, యోగా చేసి.హెచ్.వెంకటరమణ, జె.రాజశేఖర్, ప్రవీణ్ వి.ఫాంటింగ్, విభాగాధిపతులు కె.చంద్రశేఖర్, బి.సుదర్శనం, బి.రాజేంద్రకుమార్, కాశీవిశ్వేశ్వరరావు, అధికారులు చంద్ర శేఖర్, జి.వి.సత్య నారాయణ, మతీన్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

ఉరుములు.. పిడుగులు..

● గోదావరిఖనిలో భారీ వర్షం
● పిడుగులతో ఉలిక్కి పడ్డ జనం

మంథని/కోల్‌సిటీ, మే 21: రెండు రోజులుగా తీవ్రమైన ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతవారణం చల్లబడింది. అదే సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. పిడుగుల మోతతో ప్రజలను భయకంపితులను చేసింది. దాదాపు గంట పాటు భారీ శబ్ధంతో కూడిన పిడుగులు చుట్టు ప్రక్కల ప్రాంతాలలో పడిన సంఘటన ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అకాల వర్షంతో నగరంలోని ప్రధాన రోడ్లు, పలు ప్రాంతాలు జలమయం కావడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కొద్ది రోజులుగా రికార్డు స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలతో రామగుండం పారిశ్రామిక ప్రాంత ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం కురిసిన అకాల వర్షంతో కొంత ఊరట కలిగించినా, పిడుగుల మోతలతో ఉలిక్కిపడ్డారు. మధ్యాహ్నం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం పడటంతో ప్రధాన రహదారులు, పలు కాలనీలు జలమయం అయ్యాయి. మరో రెండు రోజుల పాటు వర్ష సూచన ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. కాగా, బుధవారం రామగుండంలో 34 ఎం.ఎం వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలు అందజేత

కారుణ్య ఉద్యోగ నియామక పత్రాలతో ఉద్యోగులు

యైటింక్లయిన్‌కాలనీ, మే 21 :కారుణ్య నియామకాల్లో భాగంగా మరణించిన/మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన 18 మంది మాజీ ఉద్యోగుల వారసులకు జీఎం బండి వెంకటయ్య ఉద్యోగ నియమాక పత్రాలను అందజేశారు. బుధవారం జీఎం చాంబర్‌లో నియమాక పత్రాలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. వారసత్వంగా తల్లిదండ్రులు అందించిన ఈ ఉద్యోగాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుర్తింపు సంఘం కార్యదర్శి జీగురు రవీందర్, ఇంచార్జీ ఎస్ఓటుజీఎం సంతోష్ కుమార్, డీజీఎం(ప) అనిల్ కుమార్, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ, డీవైపీఎం వంశీధర్ నాయకులు బీ అన్నారావు పాల్గొన్నారు.

పెద్దపల్లి డాక్టర్లకు కలెక్టర్ అభినందనలు

పెద్దపల్లి టౌన్, మే 21: పెద్దపల్లి మాతా శిశు సంరక్షణ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్లు శౌరయ్య, అనసూయ, శ్రీధర్ అరుదైన గర్భసంచి ఆపరేషన్ విజయవంతం చేయడం పట్ల జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష డాక్టర్ల బృందాన్ని అభినందించారని దవాఖాన డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా గర్బసంచిలో గడ్డతో తీవ్ర ఇబ్బంది పడుతున్న మైనార్టీ మహిళకు రక్త హీనత, ఫిట్స్ ఉన్న క్లిష్టమై పరిస్థితుల్లో డాక్టర్లు ఏంతో కష్టపడి ఆపరేషన్ విజయవంతం చేశారని తెలిపారు. ఏలాంటి అత్యవసర , క్లిష్టమైన ఆపరేషన్లు ఉన్నా పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానలో చేయించుకోవాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీధర్ ప్రజలను విజ్ఞప్తి చేశారు. ప్రజలు ప్రభుత్వ వైద్యసేవలను సద్వినియోగించుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

ధర్మారం,మే21:ధర్మారం లోని కస్తూర్బా గాంధి బాలికల గురుకుల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 5వ తరగతిలో ప్రవేశం కోసం నిరుపేద విద్యార్థినుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రత్యేక అధికారి విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.బాలికలు వారి ఆధార్ కార్డు,తల్లిదండ్రుల ఆధార్ కార్డు,తెలుపు రేషన్ కార్డు,4వ తరగతి ప్రగతి సర్టిఫికెట్,టీసీ,స్టడి జిరాక్స్ ప్రతులతో పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల31 గడువు ఉందని పేర్కొన్నారు. వివరాలకు సెల్ 9849059339,9959935647ను సంప్రదించాలని విద్యాలయ ప్రత్యేక అధికారి విజయలక్ష్మీ వివరించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

జ్యోతినగర్ మాట్లాడుతున్న డీఈవో మమాధవి

జూలపల్లి, మే 21 : జూలపల్లిలో బుధవారం 'కెపాసిటీ బిల్డింగ్' పై జూలపల్లి, ఎలిగేడు మండలాలకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు, గణితం, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానంలో తగిన మెలకువలు నేర్పించాలనీ, విద్యా ప్రమాణాలు మెరుగుపర్చి లర్నింగ్ అవుట్ కమ్స్ సాధించేలా కృషి చేయాలని ఎంఈవో సరస్వతి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్పీలు రాజేంద్రరెడ్డి, సంపత్‌కుమార్, భాస్కర్, యోగేందర్, రాజేశ్‌కుమార్, త్రివేణి, సీఆర్పీలు తిరుమల, సతీశ్, సీసీవోలు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సందర్శించిన జిల్లా విద్యాధికారి

జ్యోతినగర్, మే 21: జిల్లాలోని 14 మండలాలకు చెందిన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్స్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌లకు పాఠశాల నిర్వహణ, నాయకత్వ లక్షణాలపై ఎన్టీపీసీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరాన్ని డీఈవో మాధవి సందర్శించారు. శిక్షణలో పాఠశాల నిర్వహణ నైపుణ్యాలు అలవార్చుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేయాలని, సబ్జెక్టులో అభ్యసన ఫలితాలు సాధించేలా విద్యావ్యవస్థలో వస్తున్న సాంకేతిక మార్పులకు అనుగుణంగా బోధన ఉండాలన్నారు. ఇక్కడ కోర్టు డైరెక్టర్ జీ జయరాజు, రిసోర్సు పర్సనల్‌లు ఆగయ్య, రాగమయి, భవాని, పురుషోత్తం, టెక్నికల్ పర్సన్ దినేశ్, సీఆర్పీ వెంకటేశ్, రామ్‌కుమార్ ఉన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి

పెద్దపల్లి టౌన్, మే 21:పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పట్ల వివక్ష చూపుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు బొంకూరి కైలాసం, కుక్క చంద్రమౌళి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఇక్కడ దళిత, బీసీ సంఘాల నాయకులు అమర జ్యోతి, బాలసాని సతీశ్, ప్రశాంత్, బండారి సునీల్‌గౌడ్, దిశ కమిటి సభ్యుడు సయ్యద్ సజ్జాద్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీ-1లో ఉద్యోగులకు క్వార్టర్స్ కౌన్సిలింగ్

క్వార్టర్స్ కౌన్సిలింగ్‌లో అధికారులు

గోదావరిఖని, మే 21: రామగుండం 1,2,3 ఏరియాల్లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు క్వార్టర్స్ కేటాయింపు కోసం బుధవారం ఆర్జీ-1లోని ఆర్‌సీఓఏ క్లబ్‌లో నాన్ ఆప్టేడ్ డీ, టీ2 టైప్ క్వార్టర్స్‌కు కౌన్సిలింగ్ జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్జీ-1 ఎస్ఓటు జీఎం గోపాల్‌సింగ్ ముఖ్యఅతిథిగా పాల్గొని కౌన్సిలింగ్ చెపట్టారు. ఉద్యోగి అర్హత, గ్రేడ్, పదవిని పరిగణంలోని తీసుకోని 239 క్వార్టర్స్‌కు కౌన్సిలింగ్ నిర్వహించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఇక్కడ పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి, ఏఐటీయూసీ వైస్ ప్రెసిడెంట్ మహేశ్, సీనియర్ పర్సనల్ అధికారి శ్రావణ్ కుమార్, హన్మంతరావు, సంక్షేమ అధికారులు రవీందర్, ఇక్బాల్, షరీఫ్, గణేశ్, సీనియర్ అసిస్టెంట్‌లు శ్రీనివాస్, అన్వేశ్ ఉన్నారు.

కొత్త బదిలీ ఉత్తర్వులు రద్దు చేయాలని వినతి

గోదావరిఖని, మే 21: జీడీకే సీఎం2,2ఏ, ఓసీపీ 5లో సింగరేణి యాజమాన్యం నూతనంగా ప్రవేశ పెట్టిన బదిలీ ఉత్తర్వులను రద్దు చేయాలని ఐఎన్టీయూసీ నాయకులు ఓసీపీ 5 హెచ్‌వోడీ గంధం రాములు, అధికారులకు వినతిపత్రం అందజేశారు. బుధవారం కొత్త ఉత్తర్వులకు వ్యతిరేకంగా పిట్ సెక్రటరీ ఆంజనేయులు, ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ కే సదానందం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించారు.. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఇక్కడ నాయకులు పోతరబోయిన సమ్మయ్య, బేబీ శ్రీని వాస్, మండా రమేశ్, తాటికొండ అంజయ్య, కుశనపల్లి శంకర్, డీ వెంకటనర్సయ్య, దాసరి నర్సయ్య, తదితరులు ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

రామగిరి, మే 21 : పిల్లిపల్లె గ్రామంలో పెద్దమ్మతల్లి ఆలయ నిర్మాణానికి బేగంపేట గ్రామ బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఉదరి సదానందం జ్యోతి దంపతులు బుధవారం రూ.1016లు విరాళం అందించారు. ఆలయ నిర్మాణ కమిటి సభ్యులు విరాళ దాతయైన సదానందంజ్యోతి దంపతులకు శాలువ కప్పి సత్కరించారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

ఫర్టిలైజర్‌సిటీ, మే 21: గాంధీనగర్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి సాంబమూర్తి(53) ఈ నెల 4న ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించగా, చికిత్సపొందుతూ బుధవారం మృతిచెందాడు. వన్‌టౌన్ ఎస్ఐ భూమయ్య తెలిపిన వివరాల ప్రకారం మద్యానికి బానిస కావడంతో సాంబమూర్తి విధులకు హాజరు కావడం లేదు. కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. కుటుంబ సభ్యులు మందలించడంతో ఆత్మహత్యకు యత్నించాడు. 15 రోజుల పాటు దవాఖానలో చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుని కొడుకు కార్తికేయ ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసునమోదు చేశారు. సాంబమూర్తికి ఇద్దరు కూతుళ్లు, కొడుకు ఉన్నారు.

కార్మికుల పింఛన్ పెంపునకు కృషి చేయండి

గోదావరిఖని, మే 21: బొగ్గు గని పెన్షన్ కార్మికులకు పెన్షన్ పెంపునకు కృషి చేయాలని ఆల్ ఇండియా కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కోరినట్లు కోల్ పెన్షనర్స్ అసోసియేషన్ హైదరాబాద్ శాఖ కన్వీనర్లు దండంరాజు రామచందర్‌రావు, ఆళవందార్ వేణు మాధవ్ ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం న్యూఢిల్లీలోని శాస్త్రి భవన్‌లో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బీకే శ్రీవాస్తవ్, పీకే సింగ్ రాథోడ్‌లు బొగ్గు రంగంలో పెన్షనర్ల దుస్థితి, వేగవంతమైన సంస్కరణల ఆవశ్యకత గురించి మంత్రికి వివరించినట్లు పేర్కొన్నారు.